క్లుప్తంగా

బీచ్‌లో వాచ్‌టవర్ పరిశీలన



వాచ్ టవర్‌ను పరిశీలిస్తున్న ఏఎస్పీ మధుసూదనరావు

సఖినేటిపల్లి: అంతర్వేది బీచ్‌లో తీర రక్షణకు ఏర్పాటు చేసిన వాచ్ టవర్‌ను కోస్టల్ సెక్యూరిటీ పోలీసు విభాగం అడిషనల్ ఎస్పీ ఎంబీఆర్ మధుసూదనరావు ఆదివారం పరిశీలించారు. దేశ రక్షణతో పాటు తీరంలో నిత్యం రద్దీగా ఉండే పర్యాటకులు రక్షణ బాధ్యతలను కూడా కోస్టల్ సెక్యూరిటీ పోలీసు సంరక్షిస్తుందని ఆయన అన్నారు. అలాగే సముద్రంలో తిరిగే వివిధ రకాల బోట్లపై కూడా వాచ్ టవర్ ద్వారా నిఘా ఉంటుందన్నారు. అనుమానాస్పద వ్యక్తులు చొరబడకుండా టవర్ ద్వారా ఎప్పటి కప్పుడు మెరైన్ పోలీసులు పర్యవేక్షిస్తారని కూడా ఆయన పేర్కొన్నారు. వెంట మెరైన్ సీఐ నవీన్ నరసింహమూర్తి, ఎస్సైలు సోమశేఖర్ రెడ్డి, నాగార్జున, మెరైన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ ప్రథమ వార్షికోత్సవం



ఆలమూరులో అలంకార భూషితుడైన శ్రీకృష్ణుడు

ఆలమూరు: గ్రామంలో వేంచేసిన శ్రీకృష్ణుడి ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య యాదవ సంఘ ప్రతినిధులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. శ్రీకృష్ణుడి విగ్రహాన్ని పుష్పమాలలలో అలంకరించిన తీరు భక్తులను మంత్రముగ్ధులను చేసింది. అనంతరం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక, భజన కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

వైభవంగా వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు



స్వామిని పల్లకీలో ఉంచి మాఢవీధుల్లో ఊరేగిస్తున్న భక్తులు

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. మూడో రోజైన ఆదివారం ఆలయ ధర్మకర్త గణేశుల వెంకటేశ్వరరావు దంపతుల ఆధ్వర్యంలో స్వామికి విశేష పూజలు జరిపారు. స్వామిని మాఢ వీధుల్లో పల్లకీలో ఉంచి ఊరేగించారు. స్వామివారికి యాగశాలలో నిత్యహవనం, ప్రధాన కుంభారాధన, సర్వదైవత్యహవనం, ఊంజల్ సేవ, గరుడ వాహన సేవ, శుద్ధి ఏకాంత సేవ వంటి విశేష పూజలు జరిపారు.

గరగ నృత్య కళాకారుడికి కళాజ్యోతి పురస్కారం



విశాఖపట్నంలో ప్రసాద్‌ను సత్కరిస్తున్న సంస్థ సభ్యులు

కొత్తపేట: గరగనృత్యం, వీరనాట్యం కళాకారుడు కొమారిపాటి ఏసువెంకటప్రసాద్‌కు విశాఖపట్నం మదర్‌థెరిసా సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ కళాజ్యోతి ఉగాది పురస్కారాన్ని అందజేసింది. కొత్తపేట మండలం పలివెల గ్రామానికి చెందిన ఏసువెంకటప్రసాద్ ఆధ్వర్యంలో ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల గరగ నృత్యం, వీరనాట్యం కళాకారుల బృందం గణతంత్ర వేడుకల్లో ప్రదర్శనలు ఇచ్చారు. విశాఖపట్నం ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో మదర్‌థెరిసా సంస్థ వారు కళాజ్యోతి పురస్కారంతో ఏసును ఘనంగా సత్కరించారు.

ఆలయ పునర్నిర్మాణానికి రూ.11 లక్షల విరాళం

మలికిపురం: మండలంలోని గూడపల్లి నూకాలమ్మ ఆలయ పునర్నిర్మాణానికి లక్కవరానికి చెందిన ముదునూరి సుబ్బరాజు, లక్ష్మీ నర్సాయమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు రూ.11 లక్షలు విరాళంగా అందజేశారు. ఈ మేరకు శనివారం రాత్రి జరిగిన జాతర సందర్భంగా విచ్చేసిన ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ చేతుల మీదుగా పై మొత్తాన్ని నూకాలమ్మ చారిటబుల్ ట్రస్టుకు వారు అందజేశారు. పై మొత్తాన్ని కుమారులు సత్య సూర్య సీతారామరాజు, వెంకట సుబ్బరాజు, గోపాలకృష్ణంరాజు సమకూర్చారు.

రోడ్డు నిర్మాణంలోనూ పచ్చ పాతమా?

- గంటి రింగ్ రోడ్డు మధ్యలో వదిలేసి అటు ఇటు సీసీ రోడ్డుగా నిర్మాణం
- ఏదో ఒక వైపు నుంచి వేయాలి కానీ మధ్యలో వదిలేయడమేంటి?
- మొత్తం రోడ్డు నిర్మించాలని స్థానికుల డిమాండ్

కొత్తపేట: రోడ్డు అనేది ఎక్కడ నిర్మించినా.. ఏదో ఒక పక్క నుంచి మొదలుపెట్టి మొత్తం రోడ్డు పూర్తి చేస్తారు.. లేదా నిధులు ఉన్నంత మేరకు ఎంతవరకు వస్తే అంతవరకూ నిర్మిస్తారు.. కానీ ఇదెక్కడి ప్రతిపాదనో గాని మండలంలోని గంటిలో ఒక రోడ్డు ఒక పక్క నుంచి కొంత మేర, మరో పక్క నుంచి కొంత మేర నిర్మించి మధ్యలో వదిలేశారు. గంటి గ్రామ పంచాయతీ పరిధిలో ప్రధానమైనది రింగ్ రోడ్డు. ఇది ఈతకోట–గన్నవరం ఆర్‌అండ్‌బీ రోడ్డు (చినపేటకు ఎదురుగా) నుంచి పెదపేట వరకూ సుమారు సుమారు 950 మీటర్లు రోడ్డు. ఈ రోడ్డును సీసీ రోడ్డుగా నిర్మాణానికి ఉపాధి హామీ పథకం నిధులు రూ.40 లక్షలతో ప్రతిపాదించారు. దీంతో స్థానికులు మొత్తం రోడ్డు వేస్తారని ఆనందించారు. తీరా చూస్తే పెదపేట నుంచి బీసీ ఏరియా వరకూ సుమారు 435 మీటర్లు మేర సీసీ రోడ్డు నిర్మించారు. అక్కడి నుంచి వరాల నాగమ్మ గుడి రోడ్డు వరకూ సుమారు 300 మీటర్లు మేర వదిలేశారు. మరలా అక్కడి నుంచి మొదలుపెట్టి ఆర్‌అండ్‌బీ రోడ్డు వరకూ సుమారు 200 మీటర్లు మేర నిర్మిస్తున్నారు. ఇదెక్కడి విడ్డూరమో గాని రోడ్డు ఆ పక్క ఈ పక్క నిర్మించి మధ్యలో వదిలేసినట్టు ఎక్కడా చూడలేదు.. అని స్థానికులు వాపోయారు. నాణ్యతా ప్రమాణాలు కూడా పాటించడం లేదని తెలిపారు. తమ ఇష్టం వచ్చినట్టు వేసుకుపోయారని ఆరోపించారు.



గంటి రింగ్ రోడ్డులో నిర్మించకుండా వదిలేసిన రోడ్డు

ఇళ్లు ఉన్నంత మేరకే రోడ్డు ప్రతిపాదన

ఇదేమిటి? ఇదెక్కడి ప్రతిపాదన? అని రోడ్డు కాంట్రాక్టర్‌ను, పనిని పర్యవేక్షిస్తున్న సిబ్బందిని ప్రశ్నించగా నివాస గృహాలున్నంత మేర రోడ్డు ప్రతిపాదించారు. మధ్యలో నివాస గృహాలు లేవని వదిలేసినట్టున్నారు.. అని చెప్పుకొచ్చారు. నివాసగృహాలున్నంత మేరే రోడ్డు అవసరమా? ఇళ్లు లేనిచోట రోడ్డు అవసరం లేదా? గాలిలో గాని వెళ్లాలా? అని స్థానికులు ప్రశ్నించారు.

ఎంఈఓ వివరణ ఇలా..

సంబంధింత పీఆర్ మండల ఇంజినీరింగ్ అధికారి డి.వీరభద్రరావును వివరణ కోరగా రింగ్ రోడ్డులో నివాస గృహాలున్నంత మేరకు అటు ఇటు సీసీ రోడ్డు ప్రతిపాదన మేరకు రోడ్డు నిర్మించామని, మధ్యలో బీటీ రోడ్డు నిర్మించేందుకు మరో ప్రతిపాదన తయారు చేయాలన్నారు. దానికి రూ.30 లక్షల వ్యయం అవుతుందన్నారు. ఆ నిధులు మంజూరయితే ఆ బిట్ కూడా వేస్తామన్నారు.

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో..

ఇదే గ్రామ పంచాయతీ పరిధిలోని పల్లిపాలెం రోడ్డును గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కొంత మేర సీసీ రోడ్డుగా, మరి కొంతమేర బీటీ రోడ్డుగా నిర్మించారు. మొత్తం రోడ్డును ఒకే ప్రతిపాదన మేరకు నిర్మించారని స్థానిక ప్రజాప్రతినిధులు, స్థానికులు తెలిపారు. కానీ ఈ రింగ్ రోడ్డు నిర్మాణంలో కేవలం పక్షపాతం చూపారని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ నాయకులు నివాస ప్రాంతం అనే కారణంతోనే మధ్యలో రోడ్డు వేయకుండా వదిలేశారని ఆరోపించారు. ఈ ప్రభుత్వంలో స్థానిక ప్రజాప్రతినిధులకు కూడా తెలియకుండా పనులు జరిగిపోతున్నాయని వాపోయారు. మధ్యలో రోడ్డు నిర్మాణం వదిలేయడం అభ్యంతరకరమని అన్నారు. వెంటనే మధ్యలో సుమారు 300 మీటర్ల రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖను డిమాండ్ చేశారు.

జాతీయ నాయకుల విగ్రహాలు శుభ్రం



సఖినేటిపల్లి పంచాయతీ వద్ద జాతీయ నాయకుల విగ్రహాలు శుభ్రం చేస్తున్న బీజేపీ శ్రేణులు

సఖినేటిపల్లి: స్థానిక పంచాయతీ వద్ద జాతీయ నాయకుల విగ్రహాలను ఆదివారం బీజేపీ శ్రేణులు నీటితో పరిశుభ్రం చేశారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు పోతురాజు సురేష్ ఆధ్వర్యంలో డాక్టర్ అంబేడ్కర్, ఇతర నాయకుల విగ్రహాలను ఈ మేరకు శుభ్రం చేసి, పరిసర ప్రాంతాలలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. యావత్తు భారత జాతికి డాక్టర్ అంబేడ్కర్ ఆదర్శప్రాయుడని, ఎన్డీఏ ప్రభుత్వం ఆయనకు ఎనలేని గౌరవాన్ని కల్పించిందని, ఆయన నడయాడిన ఐదు ప్రాంతాల్లో పంచ తీర్థాల పేరుతో అభివృద్ధి చేసిందని పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్, కిసాన్‌మోర్చా రాష్ట్ర డ్రైనేజీ సెల్ కన్వీనర్ చెంపాటి శివరామకృష్ణంరాజు పేర్కొన్నారు. నాయకులు ఇందుకూరి సుబ్బరాజు, పట్టపు సూర్యప్రకాశరావు, ఆకన వెంకట్రావు, కె.సతీష్ పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయానికి పోటెత్తిన భక్తులు

ఆలమూరు: చింతలూరు నూకాంబిక అమ్మవారి జాతర, తీర్థోత్సవాలకు సంబంధించి భక్తుల తాకిడి కొనసాగుతుంది. ఆదివారం సెలవు కావడంతో అనేక ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దీంతో ఆలయానికి భక్తుల తాకిడి అధికం కావడంతో క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకుని నూతన వస్త్రాలు, పసుపు కుంకుమలు సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు. చిన్నారులు, బాల, బాలికలు జెయింట్‌వీల్, కొలంబస్, రంగులరాట్నాలను ఎక్కేందుకు ఆసక్తిని కనబర్చారు. పంచాయతీ కార్మికులు తీర్థంలో పేరుకుపోతున్న చెత్త, చెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించి పారిశుధ్యాన్ని నెలకొల్పుతున్నారు. భక్తుల తాకిడికి అనుగుణంగా ఆలయంలో కనీస సౌకర్యాలను కల్పిస్తున్నామని దేవదాయశాఖ ఈఓ ఉండవల్లి వీర్రాజుచౌదరి తెలిపారు.

ట్రాఫిక్ జామ్

చింతలూరులోని నూకాంబిక అమ్మవారి తీర్థ మహోత్సవానికి విచ్చేసిన భక్తుల వాహనాల రద్దీతో ఆదివారం సాయంకాలం భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. కొత్తూరు–వెదురుమూడి రోడ్డులో రద్దీ సమయంలోను ఓఎన్జీసీ వాహనాలు రాకపోకలు సాగించడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. దీంతో ఆలమూరు ఎస్సై ఎం.అశోక్ నేతృత్వంలో పోలీసు సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.



చింతలూరు నూకాంబిక ఆలయంలో క్యూలో బారులు తీరిన భక్తులు

కోకో గింజలను అంతర్జాతీయ ధరలకు కొనాలి

అంబాజీపేట: కోకో సాగు చేస్తున్న రైతుల వద్ద నుంచి కోకో గింజలను అంతర్జాతీయ ధరలకు అనుగుణంగా కొనాలని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా కోకో సాగు రైతుల సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. అంబాజీపేట కృషీవల కోకోనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్ కార్యాలయంలో జిల్లా స్థాయి కోకో సాగు రైతుల సమావేశం రాష్ట్ర కోకో సాగు రైతుల సంఘం సంయుక్త కార్యదర్శి కొప్పిశెట్టి ఆనంద ప్రసాద్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. జిల్లా కోకో సాగు రైతుల అధ్యక్షుడు ఉప్పుగంటి భాస్కరరావు మాట్లాడుతూ కోకో గింజలు కొనుగోలు చేసే వ్యాపారులు కొన్ని సాకులతో కోకో రైతుల వద్ద నుంచి తయారైన గింజలను తక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్నారన్నారు. ప్రస్తుతానికి అంతర్జాతీయ మార్కెట్‌లో కిలో కోకో గింజలు రూ.750 ఉన్నాయని, అయితే రూ.490కే కొనుగోలు చేస్తున్నారన్నారు. ఆ ధరకు కూడా ప్రస్తుతం కొనుగోలు చేయకపోవడంతో కోకో రైతులు తీవ్ర నష్టాలను చూస్తున్నారన్నారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఇప్పటికే పలుమార్లు కోకో సాగు రైతుల సంక్షేమం కోసం పలు సమావేశాలు నిర్వహించారన్నారు. సమావేశంలో పాల్గొన్న కోకో గింజలు కొనుగోలు వ్యాపారులు రైతులు తగిన నాణ్యత ప్రమాణాలతో గింజలను తయారు చేయడం లేదని అందువల్లే తాము కొనుగోలు చేయడం నిలుపుదల చేశామన్నారు. ఈ విషయంలో రైతులు కూడా నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా కోకో గింజలు ఉత్పత్తి చేయాలని సమావేశం కోరింది. సాధారణంగా 30 నుంచి 40 కోకో కాయల నుంచి లభించిన 3.50 పచ్చి గింజలను పులియబెడితే నాణ్యమైన కేజీ గింజలు లభిస్తాయని వీటికి మంచి డిమాండ్ ఉంటుందని పేర్కొన్నారు. ఈ నెల 17న అమలాపురం కలెక్టరేట్‌లో కోకో సాగు రైతుల సమావేశం ఉందని అక్కడ కొనుగోలు వ్యాపారులతో చర్చించి సానుకూలమైన నిర్ణయం కలెక్టర్ తీసుకుంటారని సమావేశం అభిప్రాయపడింది. సమావేశంలో ప్రొడ్యూసర్స్ కంపెనీ సీఈఓ అడ్డాల గోపాలకృష్ణ, బీకేఎస్ జిల్లా అధ్యక్షుడు చేకూరి సూర్యనారాయణ, రాష్ట్ర కోకో సాగు రైతు సహాయ కార్యదర్శి అడబాల రాజమోహన్, రైతులు అయ్యగారి శ్రీనివాస్, దొంగ నాగేశ్వరరావు, చిట్టావఝ్ఝల బాబురావు, బొక్కా ఆదినారాయణ, సరెళ్ల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



అంబాజీపేట సమావేశంలో మాట్లాడుతున్న కోకో సాగు రైతులు

జగ్గిరెడ్డికి అభినందనల వెల్లువ

ఆలమూరు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడిగా ఎంపికైన చిర్ల జగ్గిరెడ్డికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు అభినందనలు తెలియజేశారు. మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్, సర్పంచ్ తమ్మన శ్రీనివాసు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి నేతృత్వంలో ఆయా గ్రామాల పార్టీ అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు, అభిమానులు ఆదివారం మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి నివాసానికి చేరుకుని శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే గుమ్మిలేరు సర్పంచ్ గుణ్ణం రాంబాబు నేతృత్వంలో పార్టీ గ్రామ శ్రేణులు మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి పూలమాల వేసి సత్కరించారు.

జిల్లా నూతన అధ్యక్షుడిని కలసిన ఇనుమర్తి

సఖినేటిపల్లి: జిల్లా వైఎస్సార్ సీపీ నూతన అధ్యక్షుడు, కొత్తపేట మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డిని, ఉయ్యూరువారి మెరక గ్రామానికి చెందిన నియోజకవర్గ చేనేత విభాగం అధ్యక్షుడు ఇనుమర్తి వీర నాగరాజు కలసి అభినందించారు.

రావులపాలెం: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన జగ్గిరెడ్డిని కలసి పలువురు అభినందించారు. కలసిన వారిలో పీకే రావు, గొల్లపల్లి డేవిడ్, మణికుమారి, కె.శ్రీనివాసరావు, బి.సాయిబాబు, సాకా ప్రసన్నకుమార్, మార్గాని గంగాధర్, కుండ అన్నపూర్ణ తదితరులు ఉన్నారు.



గోపాలపురంలో జగ్గిరెడ్డిని సత్కరిస్తున్న ఆలమూరు మండల కన్వీనర్ తమ్మన తదితరులు

ఈదురుగాలులతో భారీ వర్షం



చింతలూరులో రాశుల్లోకి వర్షపునీరు చేరడంతో నష్టనివారణ చర్యలు చేపడుతున్న రైతులు

ఆలమూరు: మండు వేసవిలో కురిసిన అతి భారీ వర్షం, ఈదురు గాలుల వల్ల జనజీవనం స్తంభించింది. ఏకధాటిగా సుమారు రెండు గంటల పాటు కురిసిన వర్షం అంతటా బీభత్సం సృష్టించింది. ఇటుక బట్టీల కళ్లాల మీద ఉన్న ఇటుక తడిసి ముద్దవడంతో యజమానులకు తీవ్ర నష్టం వాటిల్లింది. అలాగే రబీ పంటలో పండించిన ధాన్యాన్ని తేమ తగ్గించుకునేందుకు ఆరుబయట ఆరబెట్టుకున్న రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ధాన్యం రాశుల్లోకి వర్షపు నీరు వెళ్లడంతో రైతులు తీవ్ర ఆందోళన పడుతున్నారు. ఒకేసారి భారీ వర్షం కురవడంతో ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకునేందుకు రైతులు తీవ్రంగా శ్రమ పడవలసి వచ్చింది. దీంతో కొంతమంది రైతుల ధాన్యం కొద్దిపాటిగా తడిసిపోయింది. అకాల వర్షం వల్ల ఎంత మేరకు నష్టం వాటిల్లుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు.

శ్రీకృష్ణుని లీలలు అనేకం

అయినవిల్లి: భగవంతుడిగా శ్రీకృష్ణుడు అనేక లీలలు భక్తులకు చూపించారని నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిర్ నిర్వాహకుడు సుందర శ్రీనివాస్‌దాస్ ప్రభుజీ అన్నారు. ఆదివారం నల్లచెరువులో అంతర్జాతీయ శ్రీకృష్ణమందిరంలో ఈ కృష్ణునికి విశేష అభిషేకాలు, పూజలు జరిపారు. సుందర శ్రీనివాస్‌దాస్ ప్రభుజీ మాట్లాడుతూ భగవంతుడు ఒక్కరే ఆయనే శ్రీకృష్ణ భగవానుడు అన్నారు. ఆయనను చేరుకోవడం భక్తులు ఆయన నామా జపాన్ని ఆచరించాలన్నారు. అనంతరం స్వామి మందిరం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు.

ఘనంగా మట్టల ఆదివారం

కొత్తపేట: ఏసుక్రీస్తు చివరిసారిగా విజయోత్సవంతో యెరూషలేంలో ప్రవేశించిన శుభ సందర్భాన్ని పురస్కరించుకుంటూ ఆదివారం గ్రామాల్లో ఘనంగా మట్టల ఆదివారం కార్యక్రమాలు నిర్వహించారు. ప్రముఖ క్రైస్తవ ప్రబోధకుడు బిషప్ జి.అబెద్నగో ఆధ్వర్యంలో పిల్లలు ఈత మట్టలతో కొత్తపేట, వాడపాలెం, అవిడిలో సండే స్కూల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వాడపాలెం ఎంపీటీసీ సభ్యుడు నేలపూడి భీమరాజు, సంఘ పెద్దలు, యూత్ సభ్యులు, బాలలు పాల్గొన్నారు.

మామిడికుదురు: ప్రజల పాపాలను తాను భరించి మానవులకు పాపాల నుంచి విముక్తి కలిగించే లక్ష్యంతో ఏసుక్రీస్తు తాను జన్మించిన యెరూషలేముకు వచ్చిన సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ క్రైస్తవులు మట్టల ఆదివారాన్ని ఆనందోత్సాహాలతో నిర్వహించారు. దీనిలో భాగంగా ఏసుక్రీస్తు గీతాలు ఆలపిస్తూ మట్టలతో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమాల్లో పాస్టర్ గుర్రం జయకుమార్, సంఘస్తులు బత్తుల జనార్దనరావు, నేరేడుమిల్లి నాగేశ్వరరావు, భయ్యా తాతాజీ, గెడ్డం వెంకటేశ్వరరావు, బళ్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో క్రైస్తవులు మట్టల ఆదివారాన్ని జరుపుకొన్నారు. క్రైస్తవ జాతికి మోక్షాన్ని ప్రసాదించి జయ ప్రవేశం కల్పించే దినంగా మట్టల ఆదివారం విశిష్టత కలిగి ఉంది. క్రైస్తవులు ఈతమట్టలు చేతబూని గ్రామ, పుర వీధుల్లో భారీ ర్యాలీలు నిర్వహించారు. అనేక గ్రామాల్లోని మత ప్రబోధకుల ఆధ్వర్యంలో ప్రార్థనలు జరిగాయి.



వాడపాలెంలో మట్టల ఆదివారం ర్యాలీ

లక్ష పసుపు కొమ్ముల నోము



లూటుకుర్రులో లక్ష పసుపు కొమ్ముల నోములో పాల్గొన్న భక్తులు

మామిడికుదురు: లూటుకుర్రు గ్రామంలో లక్ష పసుపు కొమ్ములు, గరిసె ధాన్యం నోము ఆదివారం ఘనంగా జరిగింది. పసుపు కొమ్ములను, ధాన్యాన్ని రాశులుగా పోశారు. వాటిపై మహాలక్ష్మి, గౌరీదేవి చిత్రాలను ప్రతిష్ఠించి ముత్తైదువులు వాటి చుట్టూ తిరిగి ప్రదక్షిణలు చేశారు. తమకు సిరి సంపదలు కలిగించడంతో పాటు సౌభాగ్యాన్ని ప్రసాదించాలని వేడుకున్నారు. గోకవరపు నాగేంద్ర, సూర్యవెంకటసత్య సుబ్బలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో జరిగిన ఈనోములో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భారీ అన్న సమారాధన

పి.గన్నవరం: లంకల గన్నవరం శివారు వేమన వారిపాలెంలో వేంచేసిన భద్రాద్రి చతుర్భుజ సీతారామ స్వామి వారి సన్నిధిలో శ్రీరామనవమి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం భక్తులకు భారీ అన్న సమారాధన నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు హాజరై అన్న ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమాలకు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఆధ్వర్యం వహించారు.

అంబేడ్కర్, జ్యోతిరావ్‌పూలే విగ్రహావిష్కరణలు

సఖినేటిపల్లి: మోరిపోడు సూర్యనారాయణ పేటలో ఆదివారం ప్రముఖులు చేతుల మీదుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మ జ్యోతిరావ్ పూలే నూతన విగ్రహావిష్కరణలు జరిగాయి. స్థానిక అంబేడ్కర్ యువజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన విగ్రహాల ఆవిష్కరణలో ముఖ్య అతిథులుగా రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, మరో మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి బత్తుల లక్ష్మణరావు పాల్గొన్నారు. స్థానిక దాతలు యు.మోహన్‌రావు, సీహెచ్ మధుకుమార్, చింతా శ్యాంబాబు సహకారంతో నిర్మించిన అంబేడ్కర్ విగ్రహ మండపాన్ని ఎమ్మెల్యే దేవ రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. అంబేడ్కర్ విగ్రహాన్ని బహూకరించిన మాజీ మంత్రి గొల్లపల్లి, స్వీయ హస్తాలతో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఆయన విగ్రహాన్ని పూలమాలాంకరణను వారిరువురితో పాటు మాజీ ఎమ్మెల్యే రాపాక చేశారు. అలాగే నల్లి రాజేష్ బహూకరించిన జ్యోతిరావ్‌పూలే విగ్రహాన్ని లక్ష్మణరావు ఆవిష్కరణ చేశారు. సర్పంచ్ ముప్పర్తి అలివేలు గంగా త్రివేణి, జెడ్పీటీసీ బళ్ళ ప్రసన్నకుమారి, వైస్ ఎంపీపీ-1 కొల్లాబత్తుల నాని, గెద్దాడ నాగేశ్వరరావు, నాయకులు సరెళ్ల విజయ్‌ప్రసాద్, ఈద రవిరెడ్డి, గెడ్డం పేర్రాజు, జాన శంకరరావు, గెడ్డం ఫిలిప్‌రాజు, నల్లి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కోఆర్డినేటర్ గొల్లపల్లి

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



విశ్వేశ్వరాయపురంలో మంజూరైన చెక్కులను అందుకున్న వారితో ఎమ్మెల్యే దేవ

మలికిపురం: ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన ఆర్థిక సాయం చెక్కులను ఆదివారం విశ్వేశ్వరాయపురం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ చేతులు మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ మేరకు 59 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.34,30,876 విలువైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. కాగా రాజోలు నియోజకవర్గంలో గత పది నెలలు కాలంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మొత్తం 206 మంది అనారోగ్యంతో బాధపడుతున్న వారికి రూ.2.02 కోట్లు మేర సాయం అందించినట్టు ఎమ్మెల్యే చెప్పారు. ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జి.పెదకాపు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నేడు రావులమ్మ జాతర

అయినవిల్లి: మండలంలోని అయినవిల్లి గ్రామదేవతగా పూజలందుకుంటున్న రావులమ్మవారికి సోమవారం జాతర మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. అమ్మవారికి గ్రామోత్సవం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గరగ నృత్యాలు, చిత్రవిచిత్ర వేషధారణలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మంగళవారం భారీ ఎత్తున తీర్థం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

షెడ్యూల్డ్ కులాలకు 51 యూనిట్ల మంజూరు

అంబాజీపేట: 2025–26 సంవత్సరానికి సంబంధించి షెడ్యూల్డ్ కులాల యాక్షన్ ప్లాన్ కింద అంబాజీపేట మండలానికి 51 యూనిట్లు మంజూరైనట్లు ఎంపీడీఓ జి.సరోవర్ తెలిపారు. సబ్సిడీ లోనుకు అర్హత, ఆసక్తి ఉన్న వారు ఈ నెల 14వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో నేరుగా నమోదు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు చేసుకునే వారు తెలుపు రంగు రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఎంపీడీఓ తెలిపారు.